# ఉత్కళమణి "గోపబంధు దాస్"

**'ఉత్కళమణి'**గా ప్రసిద్ధి చెందిన గోపబంధు దాస్ గారి గురించి మన ప్రాంతంలో ఎక్కువ మందికి తెలిసి ఉండకపోవచ్చును. అకుంఠితమైన దేశభక్తి, ప్రగాఢమయిన ఆధ్యాత్మికత, మొక్కవోని కార్యదక్షత, ఉత్కృష్టమయిన సంస్కరణాభిలాష ఆయనకు స్వంతం. 1877లో అక్టోబరు 9న ఒక సామాన్య బ్రాహ్మణ కుటుంబంలో ఒరిస్సాలో ఆయన జన్మించారు. పుట్టిన కొద్దిరోజులకే తల్లి చనిపోయింది. తల్లి ప్రేమాదరణలకు దూరమయిన గోపబంధు విధినిర్హేతుక కాఠిన్యాన్ని తలచుకొని చాలాకాలం వాపోతూ ఉండేవాడు. తరతరాలనుండి ఇంట్లో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక వాతావరణం, శిక్షణ ఆయనకు స్వాంతనను కల్గించడటమే కాక అన్నిరకాలైన దురాగతాలను ఎదుర్కొనే శక్తిని ఇచ్చింది. మానవ వైఫల్యం వలననో, ప్రకృతి వైపరీత్యాల వలననో కష్టాలు పడుతున్న సామాన్యులకు అండగా నిలిచే వైఖరి చిన్ననాటి నుండీ ఆయనకు ఏర్పడింది. ఒరిస్సా రాష్ట్రంలో స్వాతంత్ర్య, భాషా ఉద్యమాలకు కొన్ని దశాబ్దాలపాటు నాయకత్వం వహించగల స్థాయికి ఆయన ఎదిగాడు. మహాత్మా గాంధీ, లాలాలజపతిరాయ్‌లకు సన్నిహిత సహచరుడిగా, ఒరియా ప్రజలలో స్వాతంత్ర్య పిపాసను రగిలించటమేకాక వారికి నాయకుడైనాడు. అనేక ఉద్యమాలు చేపట్టాడు. ప్రచార ఆర్భాటం అంటే ఏమాత్రం గిట్టని గోపబంధు దేశమాత దాస్యశృంఖలాలను త్రెంచటానికి తనను తాను అర్పించుకొని, ఒరియా ప్రజల హృదయాలలో నేటికీ శాశ్వతంగా నిలిచి ఉన్నారు.

## విద్యాభ్యాసం :

గోపబంధు అక్షరమాల నేర్చుకోగానే అతనిని జగన్నాథ్‌దాస్ విరచిత **'భాగవతం'** నుంచి ఒక్కో అధ్యాయం గానం చెయ్యమని ప్రోత్సాహించారు. ఆ గ్రంథంలోని భాషా, భావ వ్యక్తీకరణ చిన్ననాడే ఆయన మీద ప్రగాఢ ముద్రవేసింది. రాగయుక్తంగా ఆయన భాగవతాన్ని పఠించేవాడు. అనతికాలంలోనే ఆ గ్రంథమంతా ఆయనకు కంఠస్థం అయింది. భాష మీద పట్టు ఆయనకు దొరికింది. చిన్నచిన్న కవితలు అల్లేవాడు. భావావేశం, అలతి అలతి పదాలలో వాటి వ్యక్తీకరణ ఆయనకు స్వంతమయి తన తండ్రి ప్రారంభించిన ప్రాథమిక ఉన్నత పాఠశాలలోనే ఆయన విద్యాభ్యాసం పూర్తి అయిన తర్వాత రూప్‌దేపూర్‌లో మిడిల్ వెర్నాక్యూలర్ పాఠశాలలో చేరాడు. అక్కడ పని చేస్తున్న పండిత్ సదాశివ మిశ్రా ప్రభావం గోపబంధు మీద పడింది.


**డా॥ బొమ్మరాజు సారంగపాణి**


గోపబంధు సాహిత్యాభినివేశం సదాశివ మిశ్రా గారికి ముచ్చట గొలిపింది. అనేక రకాలుగా గురువు గారు శిష్యుడ్ని ప్రోత్సాహించేవారు. రూప్‌దేపూర్‌లో చదువు పూర్తి అయిన తర్వాత పూరీ జిల్లాస్కూల్ లో చేరాడు. పూరీలో ఆయనకు శ్రీరామచంద్రదాస్‌తో పరిచయం కల్గింది. ప్రముఖ న్యాయవాది అయిన రామచంద్ర దాసు గారు పేదలు, దుఃఖితులు, దళితుల పట్ల ఎంతో ఆదరం కలిగి ఉండేవారు. రామచంద్ర దాస్ పర్యవేక్షణలో మరొక సంస్కృత విద్యార్థి వసుదేవ తమ తమ ప్రతిభా విశేషాలను వృద్ధిపరచుకొన్నారు. ఆ తర్వాత కాలంలో పండిత్ వసుదేవ్ రథ్‌గా సంస్కృత భాషా పండితునిగా ప్రసిద్ధి చెందినది ఆనాటి ఆయన బాల్యమిత్రుడే.

## విద్యార్థి దశనుండే సేవాతత్పరత :

పూరీలో విద్యార్థిగా ఉన్నప్పుడు జగన్నాథస్వామి రథోత్సవం నిర్వహించబడింది. అప్పుడు కలరా వ్యాధి వ్యాపించింది. కలరాకు చికిత్సలేని ఆరోజులలో అనేకమంది యాత్రికులు చనిపోయారు. ప్రభుత్వపరంగా ఎలాంటి తోడ్పాటు అందలేదు. యాత్రికుల శవాలు పేరుకొని దుర్గంధం వ్యాపించినా పురపాలకసంఘం వారు పట్టనట్లు ఊరుకొన్నారు. గోపబంధు వెంటనే రంగంలోకి దిగి సాటి విద్యార్థులను, యువజనులను సమీకరించి అనాథ ప్రేత దహన సంస్కారాలకు పూనుకున్నాడు.

మరణావస్థలో ఉన్నవారిని స్వాంతన పరచటానికి ప్రయత్నించాడు. 'పూరీ సేవాసమితి' పేరుతో ఆయన చేసిన ఈ సేవలను ప్రజలు కొనియాడారు. ఆ కార్యనిర్వహణలో హరిహర దాస్ గోపబంధుకు సాయంగా నిలబడ్డారు. ఈ హరిహర దాస్ తర్వాతికాలంలో ప్రముఖ భూదాన ఉద్యమ నాయకుడిగా ఎదిగాడు. గోపబంధు మరొక స్నేహితుడయిన దివాకర్‌దాస్ పూరీలో వైద్య, ప్రజారోగ్యశాఖ నిర్లక్ష్యవైఖరిని దుయ్యబడుతూ వ్రాసిన వ్యాసం **'స్టేట్‌మన్'** పత్రికలో ప్రచురితం అయింది. పూరీలో సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్న చార్లెస్ చెక్ కోపోద్రిక్తుడై, ఆ వ్యాస రచయిత అయిన దివాకర్‌ను పట్టుకొని వీధిలోకి ఈడ్చి బెత్తంతో అందరిముందు కొట్టాడు. సహచరులందరూ ఎదురు దాడికి దిగటంతో ఆ ఆంగ్లేయుని ప్రాణాలకు ముప్పు ఏర్పడింది గోపబంధు వారిని శాంతపరచి దివాకరన్ చేత స్థానిక మేజిస్ట్రేటు కోర్టులో దావా వేయించారు. మేజిస్ట్రేటు ఆదేశాల మేరకు సివిల్ సర్జన్ ఒక బహిరంగ ప్రదేశంలో దివాకర్‌కు క్షమాపణలు చెప్పాడు. భారతీయుల గౌరవ మర్యాదలను కాపాడటానికి, అధికార గర్వంతో విర్రవీగే తెల్లవారికి బుద్ధి చెప్పటానికి ఈ ఉదంతం పెద్ద దృష్టాంతం అయింది.

## "సాంఘిక సేవ - స్వచ్ఛంద జీవనము" లక్ష్యాలు :

ఈనాడు మనం నిర్మించే జాతీయతావాదం గతానికి చెందిన వారసత్వం అనే గట్టి పునాది మీద నిర్మిస్తే తప్ప అది చిరకాలం నిలిచి ఉండదనే విశ్వాసం గోపబంధుది. ఏ జాతిగానీ, సాహిత్యం గానీ సంప్రదాయాలను వదలి జీవించలేదని, కొత్తదనం పాతవాటిని నిరసించటం వివేకం అనిపించుకోదని ఆయన ప్రగాఢంగా నమ్మేవారు. విద్యార్థి దశలోనే ఆయన వ్రాసిన రచనలలో ఈ భావాలు వ్యక్తం అవుతుండేవి. మెట్రిక్యులేషన్ పరీక్షలో కృతార్థుడైన తర్వాత కటక్‌లో కళాశాలలో చేరిన గోపబంధు **'కర్తవ్య బోధినీ సమితి'** అనే సంఘాన్ని తోటి విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలపై వారంవారం ఆ సమితిలో చర్చలు జరిపేవారు. కటక్‌లోని బెంగాలీవారు వంగభాషను ఒరియా భాష స్థానంలో వ్యాపింప చేయాలని తీవ్రంగా ప్రయత్నం చేసేవారు. ఆంగ్లం నుండి తర్జుమా నిమిత్తం ఒరియా పాఠం బదులు వంగపాఠాలు ఇస్తుండేవారు. గోపబంధు దానికి వ్యతిరేకంగా పోరాడి కలకత్తా విశ్వవిద్యాలయాన్ని ఒరియా భాషలోకూడా అనువాద నిమిత్తం పాఠాన్ని ఇచ్చేందుకు ఒప్పించారు. 1904లో ఆయన పట్టభద్రుడయ్యాడు. గోపబంధు, ఆయన సహాధ్యాయులు గోపీనాథ్‌దాస్, వైద్యనాథ్ మిశ్రాలు పూరీవెళ్ళి గురువు గారైన రామచంద్రదాసును భావి కర్తవ్యాన్ని ఉపదేశించమని వేడుకున్నారు. **"జీవితంలో మీ లక్ష్యం ఏమిటి?"** అన్న ఆయన ప్రశ్నకు వైద్యనాథ్ గోపీనాథ్‌లు ముక్తకంఠంతో **"ప్రభుత్యోద్యోగం"** అని చెప్పగా గోపబంధు **"సాంఘిక సేవ, స్వచ్ఛంద జీవనము"** అని సమాధానం చెప్పారు. వారి లక్ష్యాలకు అనుగుణంగానే వారి తదనంతర జీవన కార్యాచరణ ఉన్నది.

గోపబంధు న్యాయశాస్త్ర విద్యార్థిగా కలకత్తాలో పుస్తకపఠనంతో సరిపెట్టుకోలేదు. కలకత్తా వీధుల్లో సందుగొందుల్లో వంటవాళ్ళుగా, కూలీలుగా హీనమైన వృత్తులలో కాలం గడుపుతున్న తన ఒరియా సోదరులను సమీకరించి, రాత్రి పాఠశాలలను ఏర్పాటు చేసి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దటానికి శ్రమించారు. వంగదేశీయులు ఒరియావారిని హీనంగా చూసేవారు. ఒరియా శ్రామికుల హక్కులకై ఆయన నిరంతరం తపించేవారు. ఒరిస్సా నుండి దూరంగా ఉంటున్నా, అక్కడ ఏదైనా ప్రకృతి విపత్తు ఏర్పడితే స్నేహితులతో కలసి వరద బాధితుల సహాయార్థం నిధులు సేకరించి పంపేవాడు. మాతృభాషను, మాతృదేశాన్ని కలలో కూడా మరువని మహోన్నతుడు గోపబంధు.

వంగదేశాన్ని లార్డ్‌కర్జన్ విభజించినప్పుడు దానికి ప్రతికూలంగా ప్రజ్వరిల్లిన స్వదేశీ ఉద్యమాన్ని గోపబంధు స్వయంగా చూశాడు. వంగదేశ యువకుల దేశభక్తి, విప్లవ కార్యాచరణము ఆయనను ఉత్తేజపరిచేవి. సంఘసేవ ద్వారానే ప్రజలలో దేశభక్తిని ప్రేరేపించాలని ఆయన ఆలోచన చేశారు. ఖుదీరామ్‌బోస్ అనుచరుడైన శశిభూషణ్ ఒరిస్సా యువకులలో విప్లవభావాలను రగిలించటానికి ప్రయత్నం చేసారు. గోపబంధు ఆయనతో స్నేహం నెరిపాడు. కాషాయ వస్త్రాలు ధరించి స్వదేశీ భావాన్ని, విప్లవాన్ని ప్రబోధించే ప్రచారకులను గోపబంధు తయారుచేసారు. ఆచార్య హరిహర దాస్, పండిత్ నీలకంఠదాస్, జగన్నాథ మహాపాత్ర, అనంత

మిశ్రా మొదలైనవారు గోపబంధు ప్రేరణతో కొంతకాలం పాటు ప్రచారక భిక్షువులుగా పనిచేశారు.

## వ్యక్తిగత విషాదాలు :

1906లో గోపబంధు న్యాయశాస్త్ర పట్టా పొందారు. తాను ఉత్తీర్ణుడైన వార్తకోసం ఎదురుచూస్తున్న ఆయనకు అదే టపాలో ఆయన భార్య మరణవార్త కూడా వచ్చింది. అప్పటికి ఆయన వయసు 28 ఏళ్ళు. పన్నెండేళ్ళ వైవాహిక జీవితంలో ఆయనకు ముగ్గురు కూతుళ్ళు, ఇద్దరు కొడుకులు కలిగారు. భార్య చనిపోయే నాటికి కొడుకులు పోయారు. కూతుళ్ళు సారంగణి, కౌతకి మాత్రమే మిగిలారు. తల్లిదండ్రులు, భార్య, గురువు, పుత్ర సంతానం అందరూ ఆయనకు దూరం అయ్యారు. చిన్న పిల్లలు అయిన తన కూతుళ్ళను అన్నగారి సంరక్షణలో పెట్టి పూర్తిగా జాతిసేవకే తన జీవితాన్ని ఆయన అంకితం చేశారు. ఆ తెగువ, త్యాగమే ఆయనను ఉత్కళ దేశపితను చేసింది. **'ఉత్కళమణి'** అనే బిరుదు తెచ్చింది. ప్రసిద్ధి చెందిన ప్రఫుల్లచంద్ర రాయ్ ఆ బిరుదును ఆయనకు ఇచ్చారు. గోపబంధు **'ఉత్కళమణి'**గా ఇంటింటా వెలిశారు.

## విద్యారంగంలో ప్రయోగాలు :

చదువు పూర్తికాగానే న్యాయవాద వృత్తిలో చేరాలా, లేక బోధనా వృత్తి చేపట్టాలా అన్న మీమాంసకు లోనయ్యాడు. ఆంగ్లేయులు నడుపుతున్న విద్యాలయాల్లో సగం సగం చదువులు చదివిన వాళ్ళు తమ సాటి ప్రజలతో కలసి ఉండటాన్ని, వారి సమస్యల పట్ల సానుభూతితో వ్యవహరించక పోవటాన్ని, కాయకష్టం అంటే ఏవగించుకోవటాన్ని ఆయన గమనించాడు. నాటి సంఘం ఆమోదిస్తున్న విద్యా ప్రయోజనాలను ఆయన గర్హించాడు. కొంత చదువు చదవగానే, తమ వృత్తి వ్యాపకాలను వదిలి వేయటం, గ్రామాలలో ఉండడం నీచంగా భావించటం ఆయనకు నచ్చలేదు. జాతీయ భావన భూమికగా విద్యావ్యాప్తి జరగాలని ఆయన భావించారు. ఆ సమయంలోనే **'నీలగిరి'** అనే స్వదేశీ సంస్థానంలో కొత్త విద్యా సంస్థను ప్రారంభించారు. గోపబంధు ఆ విద్యాసంస్థకు ప్రధానోపాధ్యాయుడిగా చేరారు. విద్యాసంస్థను స్థిర పర్చటానికి తన శక్తివంచన లేకుండా గోపబంధు ప్రయత్నం చేసినా కృతకృత్యుడు కాలేదు. ఒరిస్సాలోని స్వదేశీ సంస్థానాలకు రాజకీయ ఏజెంటుగా ఉన్న కోబ్టన్‌రామ్సే అడుగడుగునా అడ్డుపడటమే అందుకు కారణం. దానితో విద్యారంగ ప్రయోగాలకు తాత్కాలికంగా విరామం ఇచ్చి 1906లో కటక్ చేరి న్యాయవాదవృత్తి చేపట్టారు. ప్రసిద్ధులైన న్యాయవాదుల దగ్గర చిన్న వకీలుగా పనిచేశారు. న్యాయవాద వృత్తి ద్వారా విశేషంగా ధనం ఆర్జిస్తున్నా అది ఆయనకు తృప్తిని ఇవ్వలేదు. ఆర్తులైన వారిని ఆదుకోవటానికి ఆయనకు సమయం దొరికేదికాదు. ఆ ఏడాది ఆగష్టులో బ్రాహ్మణి, వైతరణి, ఖంసోర్ మహానది, నదులకు వరదలు వచ్చి ప్రాణనష్టం, ఆస్తినష్టం విపరీతంగా జరిగింది. వరద బీభత్స హృదయవిదారక గాథలు గోపబంధుని కర్తవ్యోన్ముఖుడ్ని చేసాయి. విద్యార్థులను సమీకరించి, వరద బాధితులను ఆదుకోవటానికి తిండి గింజలు, బట్టలు సేకరించి తక్షణమే కార్యరంగంలోకి దిగారు. ఆర్తులను ఆదుకోవటానికి ఎప్పుడూ ముందుండే ఆయన నైజం వరదబాధితుల పాలిట కల్పతరువైంది. పూరిలోని స్థానిక కుష్టురోగుల శరణాలయానికి కార్యదర్శిగా, 'సాక్షిగోపాల్' దేవాలయ ధర్మకర్తల సంఘ సభ్యుడిగా, పురపాలక సంఘ సభ్యుడిగా ఆయన సేవలు అందించారు.

పూరీకి సమీపంలోని సాక్షిగోపాల్ పట్టణానికి దగ్గరగా ఆయన ప్రారంభించిన సత్యవాది వన విద్యాలయం భారత విద్యారంగంలో ఒక పెద్ద ప్రయోగం. ప్రతి మనిషికీ విద్య నేర్చుకోవటానికి సమానమైన హక్కు

### ప్రజల భాషే పాలనా భాషగా ఉండాలి

*"పరిపాలన సాగించే భాష ప్రజలకు అర్థమయ్యే భాషగా ఉండాలి. ప్రభుత్వం అవలంబించే పద్ధతులు, దాని యంత్రాంగం ప్రజలకు అతీతంగా ఉండటం మంచిదికాదు. ప్రజల భాషలోనే పాలన సాగాలి".* **- గోపబంధు.**



ఉందని, సూర్యచంద్రుల కాంతి, సౌభాగ్యం అందరికీ అందుతున్నట్లుగానే విద్య అనే వికాసం కూడా అందరికీ సమానంగా ఉండాలన్న లక్ష్యంతో గోపబంధు దాసు తన సన్నిహిత మిత్రులతో కలసి ఎంతోవ్యయ ప్రయాసలకు లోనయి సత్యవాది వన విద్యాలయాన్ని 1901లో ప్రారంభించాడు. ఆ తర్వాత నాలుగు సంవత్సరాలకు రవీంద్రనాథ్ ఠాగూర్ శాంతినికేతన్‌లో విద్యాలయాన్ని ప్రారంభించాడు. చక్కని ప్రకృతి ఒడిలో ఒక నూతన విద్యావిధానానికి గోపబంధు శ్రీకారం చుట్టారు. సత్యవాది విద్యాలయంలో కులభేదాలు, హెచ్చుతగ్గులు లేవు. అక్కడ అందరూ కలసి చదువుకోవాలి, కలసి తినాలి, కలసి ఆడుకోవాలి. పాడుకోవాలి, పాఠ్య విషయాలను బోధించడమే కాకుండా, విద్యార్థులకు వృత్తివిద్యలలో, వ్యవసాయంలో శిక్షణ ఇచ్చి, వారికి స్వతంత్ర్య జీవనోపాధి కల్గించటం లక్ష్యంగా అక్కడ తర్ఫీదు ఉండేది. మనస్సును, శరీరాన్ని రెంటిని సుశిక్షితం చేస్తూ మానవత్వం గల వ్యక్తులుగా విద్యార్థులను తయారు చేయాలన్న ఆదర్శంతో నూతన బోధనా పద్ధతులతో ప్రాచీన గురుకుల వాతావరణంలో విద్యాలయాన్ని నడిపారు. చర్చాసదస్సులు, విహారయాత్రలు, శారీరక వ్యాయామం, ప్రగతి శీల ఆచరణ, సంస్కృత భాషా విజ్ఞానం పట్ల సంస్కృతిపట్ల అభినివేశం కల్గించటం ఆ విద్యాలయ ప్రత్యేకతలు. విహార యాత్రలకు కాలినడకన తీసుకొని వెళ్ళేవారు. ఆయా ప్రదేశాల చారిత్రక ప్రాముఖ్యాన్ని ముందు పిల్లలకు వివరించటమూ, దానికి అనుగుణంగా గీతాలను, పద్యాలను తయారు చేసి దారివెంబడి పాడుతూ, ఆడుతూ విద్యార్థులు, వారితోపాటు ఉపాధ్యాయులు వెళ్ళేవారు. ఒరిస్సా చరిత్రలోని ముఖ్యఘట్టాలను విహార యాత్రల ద్వారా పిల్లలకు తెలియచేసేవారు. కోణార్క్‌కు వెళ్ళిన ఒక విహారయాత్ర కృపాసింధు మిశ్రా చేత **'కోణార్క్'** అనే ప్రసిద్ధ చరిత్ర గ్రంథాన్ని, పండిత్ నీలకంఠదాస్ చేత **'కోణార్క్'** అనే పేరుతోనే ఒక ప్రసిద్ధ కావ్యాన్ని రచియింపచేసింది.

1912లో బీహారు ఒరిస్సాలను ఒక ప్రత్యేక రాష్ట్రంగా పునర్ వ్యవస్థీకరించారు. ఒక శాసన మండలిని కూడా ఏర్పాటు చేశారు. గోపబంధు దాస్ 1917లో శాసనమండలి సభ్యుడిగా ఎన్నికయ్యారు. నాలుగు ప్రధాన అంశాలపై ఆయన దృష్టి పెట్టారు. ఒరియా భాష మాట్లాడే ప్రాంతాలు, బెంగాల్, మధ్యపరగణాలు, మద్రాసు, బీహార్ రాష్ట్రాలలో ఉన్నాయి. వాటిని సమైక్య పరిచి ఒకే పాలనా వ్యవస్థ క్రిందకు తీసుకొని రావడం, శాశ్వతంగా వరదలు, క్షామాలు నివారించేందుకు పరిష్కారమార్గాలు రూపొందించటం, ఎక్సైజ్ సుంకం లేకుండా ఉప్పు సంపాదించే హక్కు తిరిగి పొందటం, **'సత్యవాద'** ఒరవడిలో విద్యావ్యాప్తికై కృషి చేయడం అనేవి ఆ నాల్గుఅంశాలు. సముద్ర తీర రాష్ట్రమైన ఒరిస్సాలో గంజాం, పూరీ, కటక్, బాలసూర్ జిల్లాల ప్రజలు ఉప్పుతయారీ చేయటంలో నిష్ణాతులు. అదే వారి ప్రధాన జీవిక కూడ. కానీ ఈస్టిండియా కంపెనీ ప్రజలకు ఉప్పుతయారు చేసుకొనే హక్కు లేకుండా చేసింది. ఉప్పు తయారీకి ప్రభుత్వ అనుమతిని తప్పనిసరి చేసింది. ఉప్పుపై ఎక్సైజు సుంకాన్ని కూడా విధించారు. ఆ జిల్లాల ప్రజలు ఉప్పు తయారీ హక్కును కోల్పోవటంలో దారిద్ర్యంలోకి నెట్టివేయబడ్డారు. ప్రజల ఉప్పు తయారీ హక్కు పురుద్ధరణకై గోపబంధు ఉద్యమాలు చేపట్టాడు. శాసన మండలిలోనూ, బయటా ఉపన్యాసాలు ఇచ్చారు. ఉప్పు సత్యాగ్రహం అనంతరం గాంధీ, ఇర్విన్ ఒడంబడికను అనుసరించి, ఒరిస్సా తీర ప్రాంత ప్రజలు తమ స్వంత అవసరాలకోసం ఉప్పు తయారు చేసుకోవటానికి, తల మీద మోసుకొని పోగలిగిన ప్రమాణంలో పొరుగు ప్రాంతాలలో అమ్ముకోవడానికి అనుమతి లభించింది. సహకార ఉద్యమంలో, కుటీర పరిశ్రమల అభివృద్ధిలోనూ గోపబంధు విశేషంగా పాల్గొన్నారు. ఒరియా భాషాభివృద్ధికోసం, ఒరియా భాషా ప్రాంతాల సమైక్యం కోసం ఆయన పాటు పడ్డారు.

గోపబంధు **'సమాజ్'** అనే వార పత్రికను స్థాపించి దాని ద్వారా సహాయ నిరాకరణోద్యమ సందేశాన్ని గ్రామగ్రామాన వ్యాపింపచేసాడు. గోపబంధు అభ్యర్థనపై మహాత్మాగాంధీ ఒరిస్సా పర్యటనకు వచ్చారు. పూరీ వైపు పాదయాత్ర చేశారు. గోపబంధు మూలంగానే ఒరియా ప్రజల పేదరికం ఎటువంటిదో గాంధీగారు తెలుసుకోగలిగారు. గోపబంధు ఒరియా పర్యటన తర్వాతే దేశంలోని పేదరికం మూల స్వరూపాన్ని ఒరిస్సాలో చూశానని, ప్రతి ఒరియా వారూ తిండికి, గుడ్డకు నోచుకొనే దాకా తాను పూర్తి ధోవతి కట్టనని గాంధీగారు

ప్రతిన పూనారు. మహాత్మాగాంధీ ఆదేశానుసారం **'తిలక్ స్వరాజ్య విధికి'** గోపబంధు వనరులు సమీకరించారు. **'కనికా'** జమీలో రైతులు తిరుగుబాటు చేశారు. భూమి శిస్తు కట్టటం మానివేశారు. రైతులను సాయుధంగా అణచి వేయటానికి జమీందారే కాల్పులు జరిపాడు. ఎందరో మరణించారు. స్త్రీలను మానభంగాలు చేశారు. ఇళ్ళకు నిప్పుపెట్టారు. ఈ దురంతాలను గోపబంధు తన పత్రిక **'సమాజ్'** ద్వారా బయటపెట్టారు. నిజనిర్ధారణ కమిటీ సభ్యునిగా జమిందార్ దురాగతాలను, దౌర్జన్యాలను ధైర్యంగా బయట పెట్టారు. చివరకు ఆయనను అరెస్టుచేసి రెండు సంవత్సరాలు జైలుశిక్ష విధించారు.

పంజాబుకేసరి లాలాలజపతిరాయ్‌తో గోపబంధుకు సన్నిహిత సంబంధాలు ఉండేవి. 1925 ఏప్రిల్ 19న పూరీలో లాలాజీ ఒక బహిరంగ సభలో ప్రసంగించారు. తాను కాంగ్రెసు సభ్యుడుగా ఉంటూ, ప్రజాసేవక్ సమాజ్ అధ్యక్షుడిగా కొనసాగుతూ హిందూ మహాసభ నిర్మాణం ఎందుకు తలపెట్టవలసి వచ్చిందో ఆయన వివరించారు. లాలాజీ ప్రేరణ వలన ఒరిస్సాలో హిందూ మహాసభ ఏర్పడింది. హిందూ మహాసభకు సంబంధించిన కార్యభారాన్ని గోపబంధుకు అప్పగించారు.

*"నాదేహం ఈదేశం మట్టిలో ఏకం కావాలి*
*ప్రజలు నావైపున నడవాలి*
*స్వరాజ్య మార్గంలో గోతులు*
*నారక్తం, మాంసం, ఎముకలు పూడవాలి*
*ఇంటింటా కదురు తిరగాలి*
*పల్లెవ్యాజ్యాలు పల్లెలోతీర్పుకావాలి*
*ఇంటిలో కదురు, ఊరిలో పంచాయితీ*
*పల్లెవాసుల్లో మాట కట్టుబాటు*
*కలిగితే ఉత్కళకడగండ్లు కడతేరినట్లే*
*జాతీయత, విశ్వజనీనతా*
*ఉత్కళ ప్రజలకు మార్గదర్శకం కావాలి దీపికలు*
*హైందవుడాశించాడు స్వసుఖాన్ని*
*హైందవ రక్తం ప్రతిబిందువూ లోకహితార్థమే"*

**- గోపబంధు దాస్**

అంతేకాక గోపబంధు ప్రారంభించిన ఒరిస్సా సహాయనిధికి పదివేలకు పై చిలుకు మొత్తాన్ని లజపతిరాయ్ విరాళంగా ఇచ్చారు. తన మరణానికి రెండు నెలలు ముందు 1928 ఏప్రిల్‌లో గోపబంధు ప్రజాసేవక్ సమాజ్ ఉపాధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డారు. ఒక అఖిలభారత సంస్థలో అదివరకు ఎన్నడూ ఒరియా మాట్లాడేవ్యక్తి అంతటి ఉన్నతి పదవిని పొంది ఉండలేదు.

1925, 1926 సంవత్సరాలలో ఒరిస్సాలో వరదలు భీభత్సాన్ని సృష్టించాయి. కాని 1927లో వచ్చిన వరదలు అంతకుముందెన్నడూ చూడని ప్రాణ, ఆస్తి నష్టాన్ని కల్గించింది. గోపబంధు సాటిలేని నేర్పుతో వరద బాధితులను ఆదుకొన్నారు. స్వయంగా కాలినడకన పల్లెపల్లెకు తిరిగి వరద బాధితులకు మనోధైర్యాన్ని ఇచ్చారు. వరదల వల్ల మళ్ళీమళ్ళీ నష్టం జరగకుండా నివారించేందుకు అఖిల ఒరిస్సా వరద నివారణ సంఘాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం వరద నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ ఎదుట గోపబంధు స్వయంగా పాల్గొని అనేక నిర్మాణాత్మకమైన సూచనలు చేశారు. గోపబంధు తన జీవితకాలంలో మిగిలిన పదినెలలును ఈ కార్యక్రమానికే వినియోగించారు. కమిటీ తన చివరి నివేదిక సమర్పించక పూర్వమే గోపబంధు స్వర్గస్తులయ్యారు.

మరణశయ్య మీద కూడా ఆయన తన దేశాన్నీ, ఒరియా ప్రజల నిస్సహాయతను మర్చిపోలేదు. స్నేహితులకు, సహచరులకు, ప్రజాహిత కార్యక్రమాలను గురించి సూచనలు ఇస్తూ ఎన్నో లేఖలను వ్రాయించారు. తన సొంత ఆస్తులకు, ఇలవేల్పుకు అంకితమైన దేవోత్తర భూములకు ధర్మకర్తలను నియమించారు. సత్యవాది ముద్రణాలయం, **'సమాజ్'** పత్రిక, **'సత్యవాది'** విద్యాలయం వితంతు ఆశ్రమం, వరద సహాయక నిధులు, తదితర ఆస్తిపాస్తులకు యాజమాన్య విషయమై అన్ని ఏర్పాట్లు చేస్తూ తన చివరి అభిమత పత్రాన్ని నాలుగు అరటావు పేజీలు ఆంగ్లంలో చెప్పారు. 1928 జూన్ 17వ తేదీన గోపబంధు స్నేహితులు, సహచరుల భగవన్నామస్మరణతో గొంతు కలిపి తుది శ్వాసవిడిచారు. తన జీవిత కాలమంతా తన మేధస్సును, శక్తియుక్తులను, కాలాన్ని, ధనాన్ని జాతికి ఇచ్చిన మహనీయుడు గోపబంధు దాస్ గారు.